
**1986 దీపావళి కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ**

# పొడుగు కాళ్ళ మనిషి

## పులివర్తి సాంబశివరావు



**"ఏమైంది నాన్నా?" శాస్త్రి తండ్రిని ఆదుర్దాతో ప్రశ్నించాడు. ముసలాయన మౌనం వహించడంతో సుబ్రహ్మణ్య శాస్త్రిలో ఆత్రుత అధికమైంది.**

"ఏమైంది నాన్నా?"

"ఏమౌవుతుంది? నీకు ఉద్యోగం చేసే రాత లేదు పొమ్మన్నారు!"

శాస్త్రి ముఖంలో దిగులు గోచరించింది. కళ్ళల్లో నీళ్ల సుడులు తిగిగాయి.

ముసలాయన చెప్పకుపోతున్నాడు.

"...జిల్లా పరిషత్తు ఆఫీసులో కనుక్కున్నాను. వెయిటింగ్ లిస్టులో గూడా నీ పేరు లేదు!"

శాస్త్రి తండ్రి వేపచెట్టు కింద నులకమంచం వాల్చుకుని అడ్డంగా నడుం వాల్చి ఆకాశంవైపు మాడ సాగాడు.

కొడుక్కు ఉద్యోగం రాలేదని తెలిసినప్పుడల్లా అంతే ఆయన.

సుబ్రహ్మణ్యశాస్త్రి బిఇడి పూర్తి చేసి ఆరేళ్ళు అయింది. మునిసిపల్ స్కూల్లో ఉద్యోగం కోసం ప్రయత్నించాడు. మునిసిమల్ కౌన్సిల్ ఛైర్మన్‌గారు తన బ్రాకెట్ కంపెనీ సభ్యుల సంతానానికే ఉద్యోగాలు సర్దేశాడు. జిల్లా పరిషత్తు స్కూళ్లలో మాష్టర్ల ఉద్యోగాలకు అభ్యర్థులను కోరుతూ ప్రకటన వెలువడింది. శాస్త్రి అప్లికేషను పెట్టి ఇంటర్‌వ్యూకి వెళ్లివచ్చాడు. జిల్లా పరిషత్ ఛైర్మన్‌గారు పేకాట క్లబ్బు సభ్యులకు సంబంధించిన వారి బంధువులకే ఉపాధ్యాయ ఉద్యోగాలను పంచేసాడు.

ఎక్కడకు పోయినా కులతత్వం, పలుకుబడి, లంచం, రిజర్వేషన్లు...!

శాస్త్రికి ఎక్కడా ఉద్యోగం దొరకలేదు. శాస్త్రి పైన పేర్కొన్న వాటిలో ఏ జాతికీ చెందనివాడు కావటమే ఇందుకు కారణం!

శాస్త్రి తండ్రివైపు చూశాడు.

ఆయన ఆకాశంలో రూపాలు మార్చుకుంటున్న మబ్బులనే తదేక దీక్షతో పరీక్షిస్తున్నాడు.

పాపం! నాన్నకు ఈ ముసలితనంలో గూడా ఎన్ని కష్టాలు!

రోజా స్టేట్‌బ్యాంకు దగ్గరా, ట్రెజరీ దగ్గరా చలానాలు వ్రాసి పదో పరకో సంపాదించుకొని వచ్చి ఎలాగో సంసార సముద్రాన్ని ఈదుతున్నాడు.

అన్నయ్య చదువూ సంధ్యా లేకుండా బికారిగా తిరుగుతున్నాడు. నాన్న ఎందరినో బతిమాలి, భంగపడి చివరకు ఎలాగో జూట్‌మిల్లులో మేస్త్రి ఉద్యోగం వేయించాడు.

కానీ అన్నయ్య ఆ ఉద్యోగమూ సరిగా చేయడం లేదు. నాలుగు డబ్బులు కళ్ళజూడగానే అన్నయ్య ప్రభుత్వ సారాయి దుకాణంలోకి దూరడం మొదలు పెట్టాడు.

మరి తను?

తండ్రి ఎంతో కష్టపడి తనను చదివించాడు. కానీ వృద్ధులైన తల్లిదండ్రులకు తను ఏ మాత్రం సాయం చేయలేకపోతున్నాడు. పైపెచ్చుగుదిబండలా తయారయ్యాడు.

ఏం చేయాలి?

ఉద్యోగాశ ఇకలేదు.

ఉద్యోగమే చేయాలని ఎక్కడుంది? విద్యవిజ్ఞానం కోసం అని సరిపెట్టుకోవడం మంచిది. ఏ పని చేసినా తప్పలేదు. కులవృత్తి అయిన పౌరోహిత్యాన్ని తండ్రే వదిలేశాడు. ఏదో ఉద్ధరిస్తాడని తనను చదివించాడు. ఇప్పుడు కులవృత్తీ చేతగాదు; ఉద్యోగమూ రాదు.

పోనీ చెప్పులు కుట్టే వాళ్ళ యింట్లో పుట్టివుంటే, ఏ భేషజమూ లేకుండా హాయిగా పనిపాటలు చేసుకొని బతికేవాడు; తల్లిదండ్రులను బతికించుకొనేవాడు. అదృష్టవశాత్తు చదువచ్చితే రిజర్వేషను కోటాలో ఉద్యోగం వచ్చేది.


ఈ ఆలోచనలతో సుబ్రహ్మణ్యశాస్త్రి మనసంతా వికలం అయింది.

"అలా బయటకు వెళ్లి వస్తానమ్మా!" తల్లితో చెప్పి శాస్త్రి స్లిప్పర్స్ వేసుకొని బయటకు నడువబోయాడు.

ఎడమకాలి స్లిప్పర్ కాడ తెగిపోయింది. స్లిప్పర్ అవతల పారేసి ఒట్టి కాళ్లతో బయటకు నడిచాడు.

కాళ్లకు సన్న సన్నని రాళ్లు గుచ్చుకుంటున్నాయి. పెద్ద బాధ అనిపించడంలేదు. కాసేపటికి అలవాటయి పోయింది.

ఆ వీధి మలుపు తిరిగేసరికి సాంబిరెడ్డి ఎదు




రయ్యాడు. సాంబిరెడ్డి సుబ్రహ్మణ్య శాస్త్రికి క్లాసు మేట్. అతడూ నిరుద్యోగే! తండ్రి కానిస్టేబులు అవడం వలన అతడికింకా కష్టాలంటే ఎలావుంటాయో తెలియదు.

"ఒరేయ్! శాస్త్రీ! సర్కస్‌కి వస్తావా?"

శాస్త్రి బదులు చెప్పలేదు. రెడ్డికి శాస్త్రి అభిప్రాయం అర్థమైంది.

"మనం టికెట్ కొనాలిసిన అవసరం లేదులే! పద!"

శాస్త్రి యాంత్రికంగా రెడ్డి వెంట నడిచాడు. రెడ్డి సర్కస్ డేరాల దగ్గర శాంతి భద్రతలు కాపాడుతున్న ఒక పోలీస్‌ని బాబాయి వరసపెట్టి పిలిచి కాసేపు పిచ్చాపాటి మాట్లాడాడు. పోలీసులందరూ రెడ్డికి పరిచయమే! వాళ్ల సాయంతో రెడ్డి టికెట్ అవసరం లేకుండానే శాస్త్రితో సహా లోపలకు పోయాడు.

శాస్త్రి సర్కస్ చూస్తున్నడే గాని మనసు మనసులో లేదు.

ఏ షీట్ చూస్తున్న నులక మంచంపై నడుం వాల్చి నైరాశ్యంతో మబ్బుల వైపే దిగులుగా చూస్తున్న తండ్రే జ్ఞాపకం వస్తున్నాడు.

సింహాలు పులులు వచ్చాయి. కొరడా పట్టుకొన్న వ్యక్తి సైగలు చేస్తున్నాడు. అతడు చెప్పినట్లల్లా ఆడి అవి వెళ్ళిపోయాయి. ఏనుగులు ఫుట్‌బాల్ ఆడాయి. అమ్మాయిలు ఒంటి చక్రం సైకిళ్లు తొక్కారు.

బఫూన్లు వచ్చారు.

ఒకడు పొట్టిగా ఉన్నాడు. వాడి మరుగుజ్జు స్వరూపం చూచి పిల్లలు తెగ నవ్వుతున్నారు.

వాడి వెనకాలే పొడుగుకాళ్ల మనిషి వచ్చాడు. అతణ్ణే చూచి అంతా విరగబడి నవ్వుతున్నారు.

శాస్త్రి అతడి కాళ్ల వైపే చూస్తున్నాడు. అవి పొడవాటి కర్రలై ఉంటాయి. కర్రలు కనిపించనీయకుండా పొడవాటి ఫ్యాంటు వేసుకున్నాడు. బ్యాలన్స్ నిలుపుకుంటూ నడుస్తున్నాడు.

శాస్త్రి పొడవు కాళ్ల మనిషి కదలికలను జాగ్రత్తగా గమనిస్తున్నాడు. అతడు తిరిగి వెళ్లేదాకా శాస్త్రి కళ్లు ఆ కాళ్లను పరిశీలిస్తూనే ఉన్నాయి.

సర్కస్ అయిపోయింది. శాస్త్రి రెడ్డికి కృతజ్ఞతలు చెప్పి ఇంటికి బయలుదేరాడు. దారిలో పొడుగుకాళ్లను గురించి ఆలోచిస్తూ ఇంటికి చేరాడు.

మరుసటిరోజు పొద్దున్నే మచ్చుమీదికెక్కి విరిగి పోయిన మంచాన్ని కిందికి దింపాడు.

"ఏమిట్రా" అన్నది తల్లి. శాస్త్రి సమాధానం చెప్పకుండా ఆ మంచాన్ని విరగ్గొట్టి, నిలువు పట్టెలుగా ఉన్న రెండు బొంగులను విడిగా తీశాడు. కుమారుడి వింతచేష్టలను ఆశ్చర్యంతో కాసేపు చూచి, ఆ తల్లి నిస్పృహతో వంటగదిలోకి పోయింది.

శాస్త్రి ఆ బొంగులకు ఒక ప్రక్కన ఆరు అంగుళాలు వదిలి అక్కడ చిన్నకొయ్య ముక్కలను మేకులు కొట్టి తగిలించాడు. బొంగులను నిలుచోపెట్టి కొయ్యముక్కల మీద కాళ్ళు పెట్టి నిలబడ్డాడు. ఇప్పుడు భూమికి ఆరంగుళాల ఎత్తులో శాస్త్రి నిలబడి ఉన్నాడు. పైన చేతులతో కర్రలను పట్టుకున్నాడు.

మొదట తొట్రుపాటు కలిగినా కాసేపటికే సర్దుకు పోగలిగాడు. నెమ్మదిగా అడుగులు తడబడ్డాయి. ఓ గంట నడిచేటప్పటికి అలవాటయింది.

రెండడుగులు ఎత్తులో కాళ్లుంచి నడిచాడు. ఇంటి చూరు తలకు కొట్టకుంది. బ్యాలన్స్ తప్పిపోకుండా నిలబడ్డాడు. ధైర్యం వచ్చింది.

వారం రోజుల్లోనే శాస్త్రి భూమికి ఆరు అడుగుల ఎత్తున సులభంగా నడవగలిగాడు.

అతడి తండ్రి ఈ తతంగం అంతా గమనిస్తూనే ఉన్నాడు. ఉద్యోగం దొరక్కపోవడంతో కుమారుడికి మతి చెడిందా అని అనుమానపడ్డాడు. చెట్టంత కొడుకుని ఏమీ అనలేక గుడ్లలోనే నీళ్ళు కుక్కుకొని మౌనంగా అతడి పాట్లు చూడసాగాడు.

శాస్త్రికి ఇప్పుడు ఎంత పొడవుగడల పైన అయినా నిలుచొని నడవగలననే నమ్మకం వచ్చింది. అతడి దీక్ష పూర్తవడంతో నున్నగా గడ్డం గీసుకుని ఊళ్ళోకి బయలుదేరాడు.

కొత్తగా వస్తువులు తయారు చేసి అమ్మే సంస్థకోసం అతడు గాలించడం మొదలుపెట్టాడు. వార్తాపత్రికల్లో, గోడలమీద ఉండే ప్రకటనలను చదివి, ఆ కంపెనీల చిరునామాలు తెలుసుకొని వెళ్ళాడు.

సబ్బుల కంపెనీ వాళ్ళకు శాస్త్రి చెప్పిన కొత్త పద్ధతి నచ్చలేదు. బిస్కెట్ల ఫ్యాక్టరీ వాళ్లకు శాస్త్రి మాటలు రుచించలేదు. శాస్త్రి నిరాశ చెందకుండా తిరుగుతూనే ఉన్నాడు.

చివరకు సాధించాడు.

కొత్తగా తయారవుతున్న టివి సెట్లకు పంపిణీ కేంద్రం ఒకటి కొత్తగా ఆ వూళ్లో వెలిసింది. శాస్త్రి ఆ కార్యాలయానికి పోయి మేనేజర్ని కలుసుకున్నాడు.

ఆత్మవిశ్వాసంతో కొత్త తరహా ప్రచారాన్ని గూర్చి చెబుతున్న శాస్త్రి మేనేజర్ని ఆకర్షించాడు.

రోజుకు యాభైరూపాయాలు ఇవ్వడానికి మేనేజర్ అంగీకరించాడు. పదిహేనడుగులు పొడవున్న మంచి వెదురుకర్రలను, కర్రలు కనబడకుండా అంతపొడవున్న ఫ్యాంటును గూడా సిద్ధం చేసి యిచ్చాడు.

శాస్త్రి తల యిప్పుడు భూమికి ఇరవై గదుగుల ఎత్తుకు పైగా ఉంది. అతడి శరీరం చుట్టూ రంగు రంగుల టివి ప్రకటన పత్రాలు వ్రేలాడుతున్నాయి.

శాస్త్రి వీధిలో కనబడగానే జనం వింతగా చూడటం మొదలుపెట్టారు.

శాస్త్రి జాగ్రత్తగా అడుగులు వేసుకుంటూ నడుస్తూ, కూడలి స్థలాల్లో కొంతసేపు నిలబడుతున్నాడు. జనాన్ని బాగా ఆకర్షిస్తున్నాడు. మేనేజరు సంతృప్తి చెందాడు.

సాయంత్రానికి యాభైరూపాయలతో శాస్త్రి ఇంటికి చేరాడు.

"నాన్నా! నా కాళ్ల మీద నేను నిలబడ్డాను. ఇవిగో! నేను మొట్టమొదట సంపాదించిన యాభైరూపాయలు! అని శాస్త్రి ఆ డబ్బును తండ్రి చేతిలో పెట్టాడు.

కుమారుడు కర్రల మీద నడుస్తుంటే పిచ్చి పట్టిందేమో అనుకున్నాడు అప్పుడు. నిజానికి తానే పిచ్చివాడు.

కుమారుని వైపు అశ్రుపూరిత నయనాలతో చూస్తూ ఆ పిచ్చితండ్రి డబ్బులు పెట్టెలో వేశాడు.

శాస్త్రి అన్నయ్య ఆ యాభైలో పాతికరూపాయలు కాజేసి పీకలదాకా తాగి వచ్చాడు. రాత్రంతా తల్లి పెద్ద కుమారుణ్ణే తిడుతూనే ఉంది.

మరుసటిరోజు ఉదయం తొమ్మిది గంటలకల్లా శాస్త్రి పొడుగు కాళ్లతో పురవీధుల్లో ప్రత్యక్షమయ్యాడు.

స్కూలు ప్రక్కగా పోయేటప్పుడు అతణ్ణే చూచిన పిల్లలు తరగతుల్లోంచి బిలబిలమంటూ బయటకు వచ్చి శాస్త్రి చుట్టూ చేరి కేరింతలు కొట్టారు.

మధ్య మధ్యలో అడ్డువచ్చే కరెంటు తీగెల్ని శాస్త్రి జాగ్రత్తగా తప్పించుకుంటున్నాడు.

"అదుగదుగో పొడుగుకాళ్ళమనిషి" అని చూడని వాళ్ళకు చూచినవాళ్లు చూపిస్తున్నారు.

శాస్త్రికి ఇప్పుడు ఏ దిగులూ లేదు.

ఎంతో తృప్తిగా, నిబ్బరంగా నడుస్తున్నాడు. ఆత్మ

స్థైర్యంతో అడుగులు వేస్తున్నాడు.

ఆ స్థితిలోనే జరుగకూడనిది జరిగింది. ఆ తప్పు శాస్త్రిది కాదు. మునిసిపాలిటీ వారిది!

రోడ్డుమీద మునిసిపాలిటీవాళ్ళు ఒక గొయ్యి తవ్వారు. ఎందుకు తవ్వారో వాళ్ళే మరచిపోయారు. తవ్విన గోతులను వాళ్ళు పూడ్చరు. అది సంప్రదాయం.

ఆ గోతిలో చెత్తాచెదారం పడివుంది. దూరం నుంచి చూస్తే అక్కడ గోయి వుందని ఎవరూ అనుమానించరు. ఇరవై అడుగుల పై నుంచి రోడ్డుపైకి చూచి నడుస్తున్న శాస్త్రి తన పొడుగు కాలును తక్కున అక్కడ పెట్టాడు. బ్యాలెన్స్ తప్పింది. ఎంత ప్రయత్నించినా నిలదొక్కుకోలేకపోయాడు.

రోడ్డుకు అడ్డంగా పడ్డాడు.

అంతటితో పోతే కాలో చేయో విరిగి బయటపడే వాడు.

కానీ అతనికి ఆ అదృష్టం లేదు. అప్పుడే ఒక లారీ వేగంగా ఆ రోడ్డు మీద వస్తోంది. డ్రయివరు బ్రేకు వేశాడు.

లారీ శాస్త్రిరెండుకాళ్ళ మీదుగా పోయిన తరువాతగాని ఆగలేదు.

అప్పటిదాకా పొడుగుకాళ్ళ మనిషిని వినోదంగా చూస్తున్న జనం ఈ దుర్ఘటనను చూచి విభ్రాంతు




అయ్యారు. కొందరు దయగల తండ్రులు శాస్త్రిని వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్ళటమే కాకుండా తమ పలుకుబడి ఉపయోగించి వైద్యంగూడా చేయించారు. శాస్త్రి ప్రాణాలు నిలబెట్టడం కోసం వైద్యులు అతడు నిలబడటానికి ఉపయోగించే రెండు కాళ్ళను తీసివేశారు.

శాస్త్రికి స్పృహ వచ్చింది.

ఎదురుగా కన్నీళ్ళతో తలిదండ్రులు నిలబడి ఉన్నారు.

శాస్త్రి తన కాళ్ళ వైపు చూసుకున్నాడు.

లేవు.

ఒక్క క్షణం కళ్ళుమూసుకున్నాడు.

అతని ముఖ మీద రెండు కన్నీటి బిందువులు టపటప పడ్డాయి.

శాస్త్రి కళ్ళు తెరిచి చూశాడు.

ఆ కన్నీళ్ళు శాస్త్రి అన్నయ్యవి.

అతడు తన తమ్ముడితల నిమురుతూ కన్నీరు మున్నీరుగా విలపిస్తూ ఉన్నాడు. గద్గదస్వరంతో అన్నాడు.

"తమ్ముడూ! బాధ్యత లేకుండా ఇన్నాళ్ళూ ప్రవర్తించాను! తలిదండ్రులను కష్టపెట్టాను! నాకంటె చిన్నవాడివి అయినా నిజంగా నువ్వే పెద్దవాడివి! కాళ్ళు పోయాయని దిగులుపడవద్దు! నువ్వు ఎప్పటికీ పొడుగు కాళ్ల మనిషివే! మాకు గందని ఎత్తులో నిలువబడి అందరికీ మార్గదర్శకుడుగా ఉంటావు! నేను కాయ కష్టంతో అమ్మనీ నాన్ననీ నిన్నూ పోషించుకుంటాను!"

అతి త్వరలో ప్రారంభం

విష్ణుమాయ రచయిత్రి శ్రీమతి జొన్నలగడ్డ లలితాదేవి

మిస్టరీ డిటెక్టివ్ నవల కాళరాత్రి

ఊరి చివర ఏడెకరాల స్థలంలో ఏకాకి భవనం!!! అందులో అనుమానాస్పదంగా ఒకరి తరువాత ఒకరి మరణం???

మిలిటరీ మనిషి గంగాధరరావు, ఎస్.పి.రాకేష్, డాక్టర్ భార్గవ మిస్టరీ ఛేదించేందుకు రంగంలోకి దిగడం ఆ యింటిలో కొందరికి గిట్టలేదు. ఎవరా కొందరు? రాత్రిళ్ళు కొబ్బరి చెట్ల వెనుక కదిలే ఆకారానికి - అక్కడ దొరికే అమెరికన్ డాలర్లకీ ఏమిటి సంబంధం?

నిమిష నిమిషం ఆసక్తిని రేకెత్తించి పాఠకుల్ని ఊపిరి సలపనివ్వని నవల కాళరాత్రి

అతి త్వరలో ప్రారంభం!?